

కాకినాడలో అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

» 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు

6



చిక్కితే.. ఖాతా ఖాళీ!

చెలరేగిపోతున్న సైబర్ నేరగాళ్లు
మళ్లీ చేతికి చేరడం అసాధ్యమే
అప్రమత్తతే ఆయుధం



దొంగలున్నారు.. జాగ్రత్త!. ఇది పోలీసులు తరచు చేసే హెచ్చరిక. మీరు ఎక్కడికైనా వెళితే ఇంట్లోని బంగారం, డబ్బు సురక్షితంగా దాచుకొని వెళ్లాలని చెబుతారు. లేదంటే తమకు సమాచారం ఇస్తే మీ ఇంటికి రక్షణ కల్పిస్తామని కూడా ఈమధ్య హోరెత్తిస్తున్నారు. ఒకవేళ సొత్తు చోరీకి గురైనా పోలీసుల దర్యాప్తులో దొంగలు పట్టుబడటం, సొత్తు రికవరీ చేయడం కూడా మనకు తెలుసు. ఇప్పుడు దొంగలు పడుతున్నది ఇళ్లలో కాదు.. జేబు దొంగలూ కాదు.. మీ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లోనే ఓ కన్నేస్తారు. ఏదొక ఎత్తుగడతో మాయ చేసో, బెదిరించో బ్యాంకు అకౌంట్ల నుంచి మొత్తం దోచేస్తున్నారు. ఇందులో ధనవంతులే కాదు.. చిరుద్యోగులు, ఉద్యోగ విరమణ చేసినవారు, పింఛను పొందుతున్న వృద్ధులు సైతం ఈ ఆన్‌లైన్ మోసంలో చిక్కి బలైపోతున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సైబర్ క్రైం విషయంలో దొంగా పోలీస్ ఆటలో దొంగలదే పైచేయిగా నిలుస్తోంది. ఆధునిక సాంకేతికతను పోలీసులు అర్థంచేసుకొనేలోపుగా సైబర్ బూచోళ్లు ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. ఇప్పటివరకూ సైబర్ నేరాల్లో గంటలోపుగా ఫిర్యాదుచేస్తే డబ్బు వెనక్కి రప్పించే అవకాశాలు సగమన్నా ఉండేవి. ఇప్పుడు ఆ సమయం నిమిషాల్లోకి వచ్చేసింది. సొమ్ము ఒక్కసారి ఖాతా దాటితే దాదాపుగా బూడిదలో పోసిన పన్నీరేనని కేసులు రుజువు చేస్తున్నాయి. అధిక శాతం పోలీసులకు ఈ నేరాలపై అవగాహన లేదు. ఎఫ్ఐఆర్ ఎలా, ఏ సెక్షన్ల ప్రకారం నమోదుచేయాలో కూడా తెలియక తికమకపడుతున్నారు. బాధితుడు మోసపోయానని గుర్తించి తేరుకొనేలోపుగా ఆ డబ్బులు నాలుగైదు దశలు దాటిపోతోంది. కొన్నేళ్ల కిందట లాటరీల పేరుతో నైజీరియన్లు సైబర్ నేరాలకు తెరతీశారు. తర్వాత మార్పులు సంతరించుకుంటూ బ్యాంకు ఓటీపీ, ఆధార్ అప్‌డేట్, ప్రభుత్వ పథకాల పేరుతో, కొరియర్, కొద్ది పెట్టుబడితో భారీ రాబడి, యాప్‌లు ఇలా రకరకాల మోసాలు సాగుతూ డిజిటల్ అరెస్టుల వరకూ పరిస్థితి చేరింది. రోజుకో మోసపు ఆలోచనతో కోట్ల సొమ్మును సైబర్ బూచోళ్లు తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వాలు, సాఫ్ట్‌వేర్లు, సర్వర్ల విషయంలో ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నా అవన్నీ బలాదూర్ అని నేరగాళ్లు నిరూపిస్తున్నారు.

● **రికవరీ దైవాధీనం**


సైబర్ క్రైంలో రికవరీ శాతం స్వల్పం. రూ.10 కోట్లు పోగొట్టుకుంటే రూ.లక్ష కూడా వెనక్కి రప్పించలేని పరిస్థితి. దర్యాప్తు ఎంత ముమ్మరంగా ఖాతా నుంచి మాయమైన డబ్బులు వెనక్కి రావడం లేదు. ఖాతా నుంచి డబ్బులు దొంగిలించారని బ్యాంకు వాళ్లకు చెబితే.. పోలీసులకు ఫిర్యాదు చేయండని ఓ సలహా పడేస్తున్నారు.

ఏపీకే క్లిక్ చేస్తే.. ఖతం

ఆర్టీవో, ఎస్‌బీఐ, పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్స్‌తో బురిడీ

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పిఠాపురం పట్టణానికి చెందిన సత్యప్రసాద్‌కు తెలిసిన మిత్రుడు వాట్సాప్ నుంచి సందేశం వచ్చింది. మీకు పీఎం కిసాన్ పడిందా లేదా చూసుకోండి అంటూ ఏపీకే ఫైల్‌ను అతను పంపినట్టు పంపారు. దాన్ని క్లిక్ చేశాడు. ఫోన్ హేక్ అయింది. ఉన్న రెండు బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఖాళీ కావడంతోపాటు ఇదే రీతిలో అతని పేరుతో కాంటాక్టు లిస్ట్‌లో ఉన్నవారందరికి మెసేజ్‌లు వెళ్లాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన నరసింహరావుకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. మీ ఎస్‌బీఐ రివార్డ్స్ అప్‌డేట్ చేసుకోండి అని అంతే క్లిక్ చేశాడు. అతని బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.6,500 డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. ఇలా రకరకాల ఏపీకే ఫైల్స్ తెలుసున్న వ్యక్తులు, స్నేహితులు, బంధువుల దగ్గర నుంచి వచ్చినట్టు వాట్సాప్‌ల ద్వారా వ్యక్తిగతంగా, గ్రూప్‌ల్లో రావడంతో మోసపోతున్నారు.



● **డిజిటల్ అరెస్టు.. రూ.34 లక్షలకు టోపీ**

ముమ్మిడివరానికి చెందిన విశ్రాంతి మండల విద్యాశాఖాధికారి బొజ్జా రమణశ్రీకి ఈనెల 8న టెలిఫోన్ డిపార్టుమెంట్ పేరిట ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మీ నంబరుపై బెంగళూరులో ఒక సీరియస్ కేసు నమోదై ఉందని, మహారాష్ట్ర కెనారా బ్యాంకులో ఏటీఎం నేరం ఉందని, రూ.3 కోట్ల కుంభకోణంలో రూ.75 లక్షలు మీకు ముట్టిందని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించారు. విశ్రాంత ఎంఈవోను బెదిరించి ఆయన అకౌంట్‌లోని రూ.15 లక్షలు లాగేశారు. తర్వాత పీఎఫ్ లోన్ తీసుకోమని వారే చెప్పి 12న రూ.9.80 లక్షలు, 15న రూ.9.80 లక్షలు.. మూడు దఫాలుగా రూ.34 లక్షల60వేలు ఆర్టీజీఎస్ చేయించుకుని టోపీ పెట్టారు.

● **రూ.74 లక్షలు కొట్టేశారిలా..**

రాజానగరం మండలం కొంతమూరు గ్రామానికి చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ మేనేజర్. ఆగస్టు 17న స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో వెతికారు. సావర్ట్ ట్రేడింగ్ యాప్ అనే పేరుతో లింక్ రాగా ఓపెన్ చేయగా, డీమ్యాట్ అకౌంట్ ఓపెన్‌చేయాలని మెసేజ్ వచ్చింది. తర్వాత దఫదఫాలుగా 11సార్లు మొత్తం రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అమౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58,55,000 వేయాలని చెప్పడంతో మోసపోయాననే అనుమానంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

● **రికవరీ చేశారు..**

రాజమహేంద్రవరంలో కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్‌కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. కస్టమర్‌కేర్ నంబరుకోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఓ నకిలీ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా ఓటీపీని చెప్పడంతో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ సొమ్మును ఫ్రీజ్‌చేసి పదిరోజుల్లో వెనక్కి రప్పించారు.

● **తక్షణం ఏమి చేయాలి..**

సైబర్ నేరం జరిగి ఖాతాలో డబ్బులు పోతే వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌కి ఫోన్ చేసి అకౌంట్ ఫ్రీజ్ చేయించాలి. సైబర్‌క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేయడంతోపాటు నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో పూర్తి వివరాలు నమోదుచేయాలి. మీ పరిధి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యా దుచేయాలి. గతంలో గంటలోపు టోల్‌ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేస్తే డబ్బులు విత్‌డ్రా కాకుండా బ్యాంకు ఫ్రీజ్ చేసేది. ఇప్పుడు నిమిషాల్లోనే నేరగాళ్లు క్రిప్టో కరెన్సీలోని మళ్లించేస్తున్నారు.



ఖోఖో ఆడుతున్న కడప-విజయనగరం.. తూర్పు-కృష్ణా జిల్లాల క్రీడాకారులు

తీరప్రాంతాల్లో ఈదురుగాలులు

» ఉప్పాడ సముద్రతీరంలో ఎగసిపడుతున్న కెరటాలు



కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

కొత్తపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉప్పాడ తీరప్రాంతాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి.దీంతో సముద్రంలో కెరటాలు సాధారణ స్థాయి మించి మీటరు ఎత్తులో ఎగసిపడుతున్నాయి. అమావాస్య,పౌర్ణమి రోజుల్లోసముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున లేవడం సర్వసాధారణమని, ప్రస్తుతం సముద్రంలో అలలు అడ్డంగా రావడం తుఫాన్ రాకకు సంకేతమని మత్స్యకారులు చెబుతున్నారు. సముద్రంలో కెరటాలు అడ్డదిడ్డంగా విరగడం గమనించిన మత్స్యకారులు ఎవరికివారు స్వచ్ఛందంగా వేటను విరమించారు.

జీజీహెచ్ వైద్యుల నిర్వాకంపై సీఎం సీరియస్

» మహిళ మృతికి కారణమైన పీజీ డాక్టర్‌తోపాటు డిపార్ట్‌మెంట్ హెడ్‌పైనా చర్యలు తీసుకోవాలని ఆదేశం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణిని పొట్టనబెట్టుకున్న కాకినాడ జీజీహెచ్ వైద్యుల నిర్వాకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ మేరకు అమరావతిలో శనివారం నిర్వహించిన సమావేశంలో తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన పెసంగి మల్లేశ్వరి(31) మృతిని ప్రస్తావిస్తూ అధికారులను వివరణ అడిగారు. తనకు పలానా మందులు పడవని ఆమె ముందుగానే చెప్పినా ఆ మాటను ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా అదే మందు ఇచ్చి ఆమె మృతికి కారణమవడం దారుణమన్నారు. ఈ ఘటనకు కారణమైన పీజీ డాక్టర్‌తోపాటు డిపార్ట్‌మెంట్ హెడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని అధికారులు పరామర్శించాలని సూచించారు. జరిగిన ఘటనపై క్షేత్రస్థాయి నివేదిక తనకు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

రేపటి నుంచి జిల్లాలో 'రైతన్న.. మీకోసం'

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 24వతేదీ నుంచి డిసెంబరు 3వతేదీ వరకు జిల్లాలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు రైతన్న మీకోసం కార్యక్రమం కింద జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు రైతు సేవా కేంద్రం స్థాయిలో ప్రతి రైతు ఇంటిని సందర్శిస్తారన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు, దిగుబడులు, వారి అవసరాలను కల్టివేటర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు, ఇతర అంశాలను దీనిలో వివరిస్తారన్నారు. పంచ సూత్రాలను సాగులో అమలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తారన్నారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక టీంను నియమించి ఇంటింటికీ వెళ్లి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం ఈనెల 24 నుంచి 29వరకు ఆరు రోజులపాటు జిల్లావ్యాప్తంగా ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. ఈనెల 30నుంచి డిసెంబరు 3వరకు రైతులనుంచి సేకరించిన వివరాలను విశ్లేషణ చేయడం, చివరిరోజు రైతు సేవా కేంద్రాలలో స్థానిక రైతులతో సమావేశం నిర్వహించి 2025-26, ఖరీఫ్ 2026, రబీ 2026-27 యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఈకార్యక్రమం విజయవంతానికి వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధక, మార్కెటింగ్‌శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

నేడు సత్య సాయి శత జయంతి వేడుకలు

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వసూచనల ప్రకారం ఆదివారం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు జిల్లాస్థాయిలో కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3.30గంటలకు కలెక్టరేట్ వివేకానందహాలులో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలన్నారు.

మన్యంలో ముందస్తు జాగ్రత్తలు

6

కొత్తపట్నం-సుబ్బంపేట మధ్య సిమెంటు రోడ్డు

» 100 మీటర్ల మేర తరచూ కోతకు గురవుతున్న తారురోడ్డు

» సిమెంటు రహదారి వేయాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం



సిమెంటు కాంక్రీటుతో నిర్మించిన కొత్తపట్నం-సుబ్బంపేట బీచ్‌రోడ్డు


కొత్తపల్లి,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కొత్తపల్లి మండలంలో ఉప్పాడ శివారు కొత్తపట్నం-సుబ్బంపేట మధ్య తరచూ కోతకు గురవుతున్న బీచ్‌రోడ్డును ఆర్అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో సిమెంటురోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. 100 మీటర్ల పొడవున ఉన్న తారురోడ్డు తరచూ కెరటాల ధాటికి ఛిద్రమయ్యేది. గతంలో రోడ్డుకు రక్షణగా డంప్ చేసిన రాళ్లను దాటుకుని కెరటాలు బీచ్‌రోడ్డును బలంగా తాకడం పరిపాటిగా మారింది. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ దెబ్బకు రాకాసి అలల ప్రభావంతో కొత్తపట్నం-సుబ్బంపేట వద్ద 100 మీటర్ల బీచ్‌రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం యుద్ధ ప్రాతిపదికన కెరటాల ఉధృతిని బండ రాళ్లతో కట్టడి చేయాలని, తరచూ కెరటాలతో పాడయ్యే 100మీటర్ల రహదారిని సిమెంటు కాంక్రీటుతో నిర్మించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో శరవేగంగా రోడ్డు నిర్మించారు.

ఘనంగా ఆర్ఎంసీ 67వ వార్షికోత్సవం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి):కాకినాడ రంగరాయవైద్యకళాశాల 67వ వార్షికోత్సవం(అద్వయ) శనివారంరాత్రి ఘనంగా నిర్వహించారు. దీనికి ఆర్ఎంసీ పాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్థాయిలో గతేడాది అత్యధిక మార్కులు సాధించి బంగారుపతకాలు సాధించిన విద్యార్థులందరికీ బహుమతి ప్రదానం చేశారు. మెడిసిన్ పూర్వ పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ సాయితేజ, అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో మానసకావ్య అత్యధికంగా బంగారు పతకాలు సాధించారు. వైద్య విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో విశ్రాంత అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ విష్ణు మహేష్, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ విజయశేఖర్, జీజీహెచ్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి పాల్గొన్నారు.

బీపీఎస్ పథకంపై విస్తృత ప్రచారం చేయాలి

» వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశం



కాన్ఫరెన్స్‌లో కమిషనర్ సుధాకర్, డీసీ శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్

కార్పొరేషన్(కాకినాడ),నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బిల్డింగ్ పర్మిట్ స్కీమ్(బీపీఎస్)పై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు పథకం ప్రయోజనాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సూచించారు. తాడేపల్లి నుంచి సీడీఎంఏ కార్యదర్శి పి.సంపత్‌కుమార్‌తో కలిసి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తి పన్ను వసూళ్లు, బీపీఎస్ స్కీమ్ అమలు, పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ తదితర అంశాలను ఆయన సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఆస్తులపై ఉన్న పన్ను బకాయిల వసూళ్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీపీఎస్ పథకం ప్రజలకు చేరువయ్యేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. 2026, మార్చి 11లోగా ఈ స్కీమ్‌ను వినియోగించేలా కమిషనర్లు కృషి చేయాలన్నారు. సమీక్ష అనంతరం కాకినాడ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ కేటీ సుధాకర్ మాట్లాడుతూ బీపీఎస్ పథకం పట్ల ప్రజలు అవగాహన పెంచుకుని స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, ఎస్ఈ పి.వెంకట్రావు, ఏసీపీ శ్రీధర్ పాల్గొన్నారు.

మన్యంలో ముందస్తు జాగ్రత్తలు

మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై నిరసన నేపథ్యంలో పోలీసుల భారీ భద్రతా ఏర్పాట్లు

రంపచోడవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి అడవుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందిన ఘటనలకు నిరసనగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు, పలు ప్రజాసంఘాలు ఆదివారం ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రంప మన్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఆదివారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మాజీ ఎమ్మెల్యేలను, మాజీ ఎంపీలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించి నివాసాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ఆయా పోలీసుస్టేషన్లకు కూడా భద్రతను పెంచారు. ఇదిలాఉండగా ఆర్టీసీ ముందు జాగ్రత్తగా మన్యానికి వచ్చే కొన్ని సర్వీసులను రద్దుపర్చింది. మారేడుమిల్లి ఎగువ ప్రాంతానికి, చింతూరు ఘాట్ రోడ్లపైకి వాహనాలను నిరోధించే యోచనలో కూడా పోలీసులు ఉన్నారు. ఇక టూరిస్టులు కూడా రాకపోవడం మంచిదన్న సూచనలు కూడా వస్తున్నాయి.

చింతూరు మీదుగా రాకపోకల బంద్



చింతూరు- భద్రాచలం నడుమ హైవేపై చింతూరు పోలీసుల బందోబస్తు

చింతూరు, నవబంరు 22 (ఆంధ్రజ్యోతి): హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆదివారం దేశవ్యాప్తంగా నిరసన పాటించాల్సిందిగా మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదలైన విషయం విధితమే. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం నుంచే చింతూరు మీదుగా సాగే వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అత్యవస పరిస్థితి క్రమంలో వయా కూనవరం మీదుగా రాకపోకలకు అనుమతి ఇస్తున్నారు. మన్యంలో పోలీసులు నిఘా పెంచారు. ఆ మేరకు కూంబింగులు చేస్తున్నారు.

జ్యోత్స్న అకాల మృతి బాధాకరం

తునిలో ఉపాధ్యాయురాలి కుటుంబాన్ని పరామర్శించిన హోం మంత్రి అనిత



తునిలో జ్యోత్స్న కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అనిత

తుని రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు జ్యోత్స్న అకాల మృతి బాధాకరమని, ఉపాధ్యాయురాలు పిల్లలకు వచ్చిన కష్టం తలుచుకుంటే చాలా బాధగా ఉందని హోం మంత్రి అనిత భావోద్వేగానికి గురయ్యారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరంలోని జడ్పీ హైస్కూల్లో భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం జరిగి తునికి చెందిన ఉపాధ్యాయురాలు జ్యోత్స్న మృతిచెందడంతో శనివారం తుని బ్యాంక్ కాలనీలో ఆమె పార్థివదేహానికి హోం మంత్రి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జ్యోత్స్న ఇద్దరి పిల్లలను చూసి చలించిపోయారు. వారిని దగ్గరకు తీసుకుని చదువుకు సంబంధించిన విషయాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పిల్లల చదువు, ఉద్యోగానికి సంబంధించిన కొన్ని వెలుసుబాటును కుటుంబ సభ్యులు హోంమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారని, ఉపాధ్యాయురాలు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హోం మంత్రి తెలిపారు. ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సకాలంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయురాలి పెద్ద అబ్బాయి ప్రస్తుత ఉద్యోగ అర్హత వయస్సు రాకపోవడంతో రెండేళ్ల తరువాత ఉద్యోగం ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. యనమల రాజేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ బోడపాటి శివదత్ ఉన్నారు.

గోదావరి మధ్యలో మత్స్యకారుల పూజలు

పాలు పొంగించి భైరవస్వామికి నైవేద్యం సమర్పణ



నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న మత్స్యకారులు

యానాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యానాంలో గోదావరి మధ్యలో (ఐలాండ్) మత్స్యకారులు పూజలు నిర్వహించారు. యానాంలోని కొత్తపేట, అగ్రహారం, ఫ్రాన్స్‌తిప్ప గ్రామల మత్స్యకారులు ప్రతీ సంవత్సరం గోదావరి నీరు తగ్గిన తర్వాత వేటకు బయలుదేరే ముందు గోదావరి మధ్యలో ఉన్న ఐలాండ్‌లో భైరవస్వామికి పాలు పొంగించి నైవేద్యం సమర్పించే పవిత్ర సంప్రదాయాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నావలో ఐలాండ్‌కు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం మత్స్యకారులందరూ పాలు పొంగించిన నైవేద్యాన్ని భైరవస్వామి) సమర్పించారు. మత్స్యకార ప్రతినిధి మల్లాడి శామ్యూల్, గ్రామ పెద్దలు ఉన్నారు.



నావలో వెళ్తున్న మల్లాడి కృష్ణారావు

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజల అనంతరం తూర్పురాజగోపురం వద్ద కుతోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

పెదపట్నంలంకలో 'రాజీ.. నో కాంప్రమైజ్'

సినిమా షూటింగ్ ప్రారంభం

మామిడికుదురు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పెదపట్నంలంకలో రాజీ... నో కాంప్రమైజ్ అనే సినిమా షూటింగ్ శనివారం ప్రారంభించారు. వినాయకుడికి పూజలు నిర్వహించిన అనంతరం దర్శకుడు గెద్దాడ ప్రసాద్ చిత్రీకరణను ప్రారంభించారు. రాజీ... మంచి మొగుడు కావాలని దేవుడికి దణ్ణం పెట్టుకో అమ్మా అంటూ కథానాయిక జయశ్రీకి తండ్రి పాత్రధారి రాజీవ్ కనకాల చెప్పిన సీన్‌తో షూటింగ్ ప్రారంభమైంది. కుటుంబ కథా చిత్రంగా సాగే ఈ చిత్రాన్ని 4రోజులు పెదపట్నంలంకలో చిత్రీకరిస్తామని దర్శకుడు తెలిపారు. పల్లెటూరు వాతావరణంలో సాగే ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. షూటింగ్‌ను తిలకించడానికి స్థానికులు ఆసక్తి కనబరిచారు.





పెదపట్నంలంకలో రాజీవ్ కనకాల, హీరోయిన్‌పై చిత్రీకరిస్తున్న సన్నివేశాలు

జైల్లో పరిచయం.. నిత్యం దొంగతనాలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

- నల్లజర్లలో అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- నల్లజర్ల, ప్రతిపాడు, తణుకులో చోరీలు చేసినట్టు గుర్తింపు
- ఒక్కొక్కరిపై 15 నుంచి 20 కేసులు
- రూ.3 లక్షల నగదు, బంగారం, రెండు బైక్‌ల స్వాధీనం

నల్లజర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో పలు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆరుగురు దొంగలను ప్రవేశపెట్టారు. వారి నుంచి రూ.3 లక్షల నగదు, బంగారం చైన్, 2 గాజులు, కారు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

నెల్లూరుకు చెందిన షేక్‌ఫక్రుద్దీన్ ఒంగోలు జైలులో ఉన్నప్పుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కేసు ఉమ్రో మోహదా (హోలిటేడా పంచాయతీ, గంధవాన్ మండలం, ధార్ జిల్లా) రాగస్ మధవ్ హటిలా, బారిక్‌సింగ్ ఆజీనార్, ముహరు కల్లు మహదా, హీరు హరియా అజీనార్‌తో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలైన తరువాత ఏపీలో సంపన్నులు ఉంటారని, చోరీలు చేద్దామనుకుని నిర్ణయించుకున్నారు. దీంతో సెప్టెంబరు 24వ తేదీ అర్ధరాత్రి తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో ఒంటరిగా నివసిస్తున్న పాకలపాటి సుభద్ర ఇంటి తలుపులు పగుల గొట్టి ఆమె మెడలోని బంగారు అభరణాలను దోచుకుపోయారు. అంతకుముందు కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని సురేష్ జ్యూయలరీ షాపులో 11 కిలోల వెండి, బైక్ దొంగతనం చేశారు. తర్వాత నల్లజర్లకు 2బైక్‌లు, కారుతో వచ్చి ఇక్కడ కూడా చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత ఖమ్మం వెళ్లి అక్కడి నుంచి మధ్యప్రదేశ్‌కు రైలులో పారి పోయారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు, దేవరపల్లి సీఐ నాయక్ ఆధ్వర్యంలో 2బృందాలు మధ్యప్రదేశ్ వెళ్లి గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఫక్రుద్దీన్ కదలికలపై నిఘాపెట్టారు. ఎట్టకేలకు శుక్రవారం మధ్యాహ్నం నల్లజర్లలో పోతవరం కుడి కాల్వ గట్టుపై అనుమానాస్పదంగా కొంతమంది తిరుగుతున్నట్టు నల్లజర్ల సీఐ రాంబాబుకు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. విచారణ అనంతరం అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాగా నిర్ధారించుకుని వారి వద్ద నుంచి సొత్తును రికవరీ చేశారు. కష్టపడి పనిచేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. వీరిని దార్ ముఠాగా పిలుస్తారని, మధ్యప్రదేశ్‌లోని 4 గ్రామాల్లో కలిసి ఉంటూ నిత్యం దొంగతనాలు చేయడం, పోలీసులు వెళితే వారిపై దాడులకు పాల్పడడం, అవసరమైతే చంపేయడం వంటివి చేస్తారని డీఎస్పీ పేర్కొన్నారు. వీరు గతంలో పోలీసు అధికారులపై ఫైర్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. తణుకులో కూడా చోరీ చేసినట్టు గుర్తించారు. ఒక్కొక్కరిపై 15 నుంచి 20 కేసులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సీఐలు నాయక్, రాంబాబు, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరంలో తప్పిన ప్రమాదం

దేవస్థానం బస్సును ఢీకొన్న బొలేరో వాహనం

గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్న భక్తులు

అన్నవరం. నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి కొండపైకి తీసుకెళ్తున్న దేవస్థానం బస్సులో భక్తులకు ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం 10గంటల సమయంలో అన్నవర దేవస్థానం బస్సు భక్తులను రైల్వేస్టేషన్ నుంచి బయలేరి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వద్ద నిలపగా వెనుక నుంచి వచ్చిన బొలేరో వాహనం బలంగా ఢీకొంది. దీంతో బస్సు కుదుపునకు గురవడంతో భక్తులు భయబ్రాంతులకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

గండిపోశమ్మ దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలో వెలసిన స్వయంభూ గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, ఆలయ పరిసరాలు బురదతో నిండి ఉన్నాయన్నారు. దీని దృష్ట్యా దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేశామని దర్శనాలకు అనుమతించే తేదీ ప్రకటించే వరకు భక్తులు ఆలయ పరిసరాలకు రావద్దన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

మండపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కేపీరోడ్డులో శనివారం కారు ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కడియం మండలం మురమండకు చెందిన పి.కాంతమ్మ(70) మండపేట కేపీరోడ్డులో యాచక వృత్తి చేసుకుంటూ జీవిస్తుంది. శనివారం ఆమెను మారేడుబాక నుంచి వాడపల్లికి వెళ్తున్న కారు ఢీకొనగా తీవ్రగాయాలపాలై మృతిచెందింది. ఘటనపై కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.



వృద్ధురాలి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

కోపంతో మామను తోసేసిన అల్లుడు

కొద్దిగంటలకే మృతి

కేసు నమోదు



మృతిచెందిన అప్పలరాజు

ధవళేశ్వరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు గొడవ పడుతుండగా మధ్యలో ఆపడానికి వచ్చిన మామను అల్లుడు తోసివేయడంతో రోడ్డుపై పడిన మామ కొద్ది గంటల తరువాత మృతిచెందాడు. ఈ మేరకు అతడి కుమార్తె సప్పిడి ధన నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో అల్లుడి సప్పిడి నివాస్‌ను ధవళేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన ధన నాగమణిని సప్పిడి శ్రీనివాస్ 5 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని ఒక అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కాపురం పెట్టాడు. కొద్దికాలం తరువాత భార్యపై అనుమానంతో కొట్టడం, తిట్టడం చేస్తుండటంతో నాగమణి భర్తను వీడి ధవళేశ్వరంలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. ఆపై భర్త రమ్మనడంతో మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోయింది. మళ్లీ భార్యభర్తలు హైదరాబాద్‌లో గొడవపడి ధవళేశ్వరం చేరుకున్నారు. ఈ క్రమంలో నివాస్ శుక్రవారం రాత్రి మళ్లీ గొడవకు దిగడంతో అడ్డు వెళ్లిన మామ బక అప్పలరాజు (58)ను కోపంతో తోసివేశాడు. దీంతో రోడ్డుపై పడిపోయాడు. పైకి ఎటువంటి గాయం కనిపించకపోవడంతో ఇంటిలోకి వెళ్లి పడుకున్నారు. అర్ధరాత్రి అప్పలరాజుకు వెక్కిళ్లు రావడంతో కుమార్తె మంచినీళ్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తుండగా మృతిచెందాడు. ధవళేశ్వరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నివాస్‌పై ఐ498ఏ సెక్షన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజోలు స్కౌట్ మాస్టర్‌కు 'జాతీయ జంబోరి' ఆహ్వానం



గోపాలకృష్ణ

రాజోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లక్నోలో ఈ నెల 23 నుంచి 29 వరకు జరిగే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 19వ జాతీయ జంబోరి 75 సంవత్సరాల డైమండ్ జూబ్లీ వేడు కలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన విశ్రాంత ఎంఈవో, స్కౌట్ మాస్టర్ జొన్నలగడ్డ గోపాలకృష్ణకు ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా డీఈవో షేక్ సలీంబాషా ఆదేశాల మేరకు తనతో పాటు తాటిపాక హైస్కూలు స్కౌట్ మాస్టర్ యెరుబండి నాగేశ్వరరావుకు ఆహ్వానం లభించిందని తెలిపారు. లక్నోలో జంబోరీకి వెళ్లిన జొన్నలగడ్డ, యెరుబండిని స్కౌట్స్ అండ్ గైడెడ్ కోఆర్డినేటర్ కె.కృష్ణప్రసాద్, ఏఎంవో రాంబాబు,దుర్గామాధవి పలువురు అభినందించారు.

అయినవిల్లిలో కేరళ డీజీపీ పూజలు

అయినవిల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేరళ డీజీపీ రావడ ఆజాద్‌చంద్రశేఖర్ శనివారం కుటుంబ సమేతంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలోని శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను డీజీపీకి అందజేశారు.



కేరళ డీజీపీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

కాకినాడలో అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

13 జిల్లాల నుంచి 130మంది హాజరు



ఖోఖో ఆడుతున్న తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల క్రీడాకారులు

కార్పొరేషన్ (కాకినాడ సిటీ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలకు క్రీడామైదానం ఉండేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఈ విషయంపై అసెంబ్లీలో చర్చిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం పాఠశాల క్రీడాసమాఖ్య అండర్ 14, 17 ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ, డీఎస్‌డివో బి.సతీష్‌కుమార్, ఖోఖో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జానకిరామయ్య, జిల్లా ఖోఖో సంఘ అధ్యక్షుడు పట్టాభిరాం, టీడీపీ నాయకులు బి.కృష్ణమోహన్, ఎన్.గోవిందు, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు క్రీడా రిజర్వేషన్‌ను 3శాతానికి పెంచారన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవిలో కాకినాడ బీచ్‌లో జాతీయ స్థాయి పోటీల నిర్వాహణకు చర్యలు తీసుకోవాలని పీడీలను కోరారు. డీఎస్ఏ ఖోఖో కోర్టుల్లో ఫ్లడ్‌లైట్లు సౌకర్యం కల్పించాలని ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి శ్రీను ఎమ్మెల్యే నానాజీని కోరగా పంతం ఫౌండేషన్ నుంచి ఫ్లడ్‌లైట్లు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి విచ్చేసి న క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ అడ్మిన్ సెక్రటరీ సుధారాణి, సంఘ ప్రతినిధులు వాసు, స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ లంకా జార్జి, మాచరరావు, రాజశేఖర్, నూకరాజు, సురేష్‌రాజు, దిశ చైర్మన్ స్వరాజ్యలక్ష్మి, జేఎన్‌టియూకే పీడీ శ్యాంకుమార్ పాల్గొన్నారు.





పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

జూడో పోటీలు...

తూర్పుగోదావరి జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో పోటీలు కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని ఇండోర్ హాల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. గౌరవ అతిథులుగా జూడో సంఘ చైర్మన్ వెలగ వెంకట కృష్ణారావు, రాష్ట్ర ఖోఖో సంఘ సీఈవో వెంకట నాగశెట్టి, రాష్ట్ర కార్యదర్శి పవన్ సందీప్, డీఎస్‌వో సతీష్‌కుమార్ హాజరయ్యారు. కాకినాడ జిల్లా జూడో సంఘ కార్యదర్శి టీవీవీ రమణ అధ్యక్షత వహించారు. వెంకట కృష్ణారావు మాట్లాడుతూ జూడో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు 2రోజులు భోజన సదుపాయం కల్పిస్తున్నారన్నారు. బాలుర, బాలికల విభాగంలో చెరో ఏడు వెయిట్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. డీఎ స్ఏ జూడో కోచ్ తేజ, వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



క్రీడాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఏటీఎంకు నిప్పు పెట్టాడు!

రెండు ఏసీలు దగ్ధం

పిఠాపురంలో అగంతకుడి దుశ్చర్య



ఏటీఎంలో కాలిపోయిన పరికరాలు, పేపర్లు

పిఠాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఒక అగంతకుడు ఏటీఎంకు నిప్పు పెట్టాడు. 2ఏసీలు, ఏటీఎం కాలిపోయాయి. శనివారం తెల్లవారుజామున 3.30-4గంటల మధ్య జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కాకినాడ జిల్లా పిఠాపురం మెయిన్ రోడ్డులో గల చర్చి సెంటర్ సమీపంలో సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ వద్దే ఏటీఎం ఉంది. శనివారం తెల్లవారుజామున అగంతకుడు ఏటీఎంకి వచ్చాడు. బయట నుంచి కాగితాలు తెచ్చి ఏటీఎం వద్ద వేసి నిప్పు పెట్టాడు. దీంతో ఏటీఎంతో పాటు అదే ఆవరణలో ఉన్న రెండు ఏసీలు కాలిపోయాయి. విషయాన్ని గమనించిన స్థానికులు, ఫైర్ అలర్ట్‌తో బ్యాంకు ఉన్నతాధికారులు పోలీసులు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గ్యాస్ సహాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే ఏసీలతో పాటు ఏటీఎం పాక్షికంగా, లోపల ఉన్న ఇతర పేపర్లు కాలిపోయాయి. నగదు కూడా కాలిపోయిందని సమాచారం. కాగా ఘటనకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి మతిస్థిమితం లేదని పోలీసులు చెప్తున్నారు. అయితే ఏటీఎంకు నిప్పు పెట్టే సమయంలో పట్టణంలోని ఇతర ఏటీఎంలను ఇదేవిధంగా కాల్చివేస్తానని ఆ ఆగంతకుడు చెప్పినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. సంఘటనపై బ్యాంకు మేనేజరు సాయిసుధ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలు సేకరించి విశ్లేషించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా ఏటీఎం పరిశీలన నిమిత్తం శనివారం రాత్రి నిపుణులు వచ్చారు.

ఏరియా ఆసుపత్రి వద్ద రోగి మృతి



స్వామి అయ్యప్ప మృతదేహం

అనపర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఏరియా ఆసుపత్రిలో అనారోగ్యంతో ఇన్‌పేషెంట్‌గా ఉండి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం తెల్లవారుజామున అదే ఆసుపత్రి భవనం వద్ద మరణించాడు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి సావరంకు చెందిన చెంకాని స్వామి అయ్యప్ప (44) మద్యానికి బానిసై ఇటీవల అనారోగ్యం పాలయ్యాడు. 4 రోజుల క్రితం అతడి తల్లి లక్ష్మి అయ్యప్పను అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేర్పించింది. శుక్రవారం రాత్రి నుంచి అయ్యప్ప పరాకు మాటలు మాట్లాడుతూ కేకలు వేశాడు. ఇది గమనించి తెల్లవార్లు కంట కనిపెడుతూ వచ్చింది. తెల్లవారుజామున కొడుకు మంచంపై లేకపోవడంతో అంతా వెతికినా ఆచూకీ లభించలేదు. ఉదయం ఆసుపత్రి ప్రహరీ పక్కన కొడుకు మృతదేహం ఉన్నట్టు సిబ్బంది తెలపడంతో చూసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

టీడీపీతోనే నెరవేరనున్న సొంతింటి కల

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప


సామర్లకోటలో లబ్ధిదారులకు రుణమంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్‌లు

సామర్లకోట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ పేద వాని ఇంటి నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వంలోనే నెరవేరుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట పట్టణ పరిధిలో గృహ నిర్మాణ రుణాలు మంజూరుపత్రాలను శనివారం ఎమ్మెల్యే చినరాజప్ప డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ వాటాతప్ప రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి రుణం మంజూరుచేసిన దాఖలాలు లేవన్నారు. ప్రతీ లబ్ధిదారుడూ సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వ రుణం సద్వినియోగం చేసు కోవాలని తద్వారా సామూహికంగా గృహప్రవేశాలు జరుపుకోవాలన్నారు. అనంతరం డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ పేదవారి ఇల్లు కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం పేదలపక్షాన ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ తు మ్మల బాబుల రుణమంజూరు పత్రాలను 154 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం తరపున రూ.2.50లక్షలు మంజూరు చేస్తుందని హౌసింగ్ డీఈ సువర్ణరాజు తెలిపారు. నూరుశాతం సబ్సిడీతో ఈ రుణం మంజూరైందన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కం టే జగదీష్‌మోహన్, బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, పి ల్లాడి సత్యవతి, అందుగుల మణికుమారి, సరోజా వాసు, మంచెం సాయిబాబు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులపై డీసీసీబీ చైర్మన్ ఆగ్రహం

గృహనిర్మాణ రుణాల మంజూరు విషయమై గృహ నిర్మాణ అధికారులతీరు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిలో నేటికీ వైసీపీ ఛాయలు పోలేదని హెచ్చరించారు.

అర్హులందరికీ గృహాలు మంజూరు

పెద్దాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ గృహాలను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప భరోసా ఇచ్చారు. పీఎంఏవై కింద మంజూరైన గృహనిర్మాణాల హామీ పత్రాల పంపి ణీ కార్యక్రమంలో ఆయన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి శుక్రవారం పాల్గొని మాట్లాడారు. పీఎంఏవై ద్వారా ప్రభుత్వం అర్బన్ ఏరియాల్లో రూ.2.5లక్షల సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు ఇస్తుండగా రాష్ట్ర వాటాగా రూ.లక్ష సాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ లబ్దిదారులు నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, కూటమి నేత పొలమర శెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో ఈనెల 24న సోమవారం ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహిస్తున్నట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈ పీజీఆర్ఎస్‌కు పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన అన్ని శాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులపై అర్జీలు ఇవ్వవచ్చునని చెప్పారు. నేరుగా హాజరుకాలేనివారు ఆన్‌లైన్‌లో తమ ఫిర్యాదులు, వినతులు నమోదు చేయవచ్చునని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మంత్రి సుభాష్ మాట్లాడిన తీరు సరికాదు

● శెట్టిబలిజ సంఘ నాయకుల హితవు

కాకినాడసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):శెట్టిబలిజ వనసమారాధనలో కులాన్ని కించపరిచే విధంగా మంత్రి సుభాష్ మాట్లాడిన తీరు సరికాదని, ఇప్పటికైనా మంత్రి సుభాష్ మాటతీరు మార్చుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ కర్రి గోపాలకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు వీరవల్లి శ్రీనివాస్, నాయకులు రాయుడు నాగేశ్వరరావు, అనసూరి ప్రభాకర్ హితవు పలికారు. స్థానిక రామారావుపేటలోని జిల్లా శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వాలు శెట్టిబలిజ ఐక్యతను చూసే మంత్రి పదవులు ఇచ్చాయన్నారు. సొంత అజెండాతో నిర్ణయాలు తీసుకుని కులాన్ని దూషించుకునే పద్ధతి సరికాదన్నారు. సమాజంలో ఎదుగుతున్న శెట్టిబలిజ కులాన్ని ప్రస్తుత తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు, రాయుడు వెంకటేశ్వరరావు, కడలి రాంపండు, వాసంశెట్టి మాదవ్, పిల్లి శ్రీధర్, ఎంపీపీలు కేత శ్రీనివాస్, లక్ష్మీ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'చదువుతో పాటు క్రీడలు అవసరమే'

కార్పొరేషన్ (కాకినాడ సిటీ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం నిర్వహించిన క్రీడా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక డీఎస్‌డీఏ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో వివిధ రకాల క్రీడలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్‌డీవో అధికారి సతీష్‌కుమార్ విచ్చేశారు. విశేష అతిథులుగా పాఠశాలల ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ కోఆర్డినేటర్ సుంకరమూర్తి, సఫూర, ప్రిన్సిపల్స్ షర్మిల, కవిత, రవికిషోర్, వీరభద్రారెడ్డి, విఠల్ పాల్గొని క్రీడాజ్యోతి వెలిగించారు. ముఖ్యఅతిథి పతాకావిష్కరణ చేయగా విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌తో గౌరవ వందనం చేశారు.

మహారాణి ఆశయ సాధనకు కృషి

● ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మహారాణి ఆశయ సాధనకు ప్రతీఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. స్థానిక రాజా వత్సవాయి బుచ్చిసీతాయమ్మ జగపతి బహుద్దూర్ మహారాణి వర్ధంతిలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ముందుగా మహారాణి విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో రాజప్ప మాట్లాడుతూ బాటసారులు, అన్నార్తులు, నిరుపేదల ఆకలిబాధను తీర్చేందుకు 18వ శతాబ్దంలో సత్రాన్ని ఏర్పాటుచేయడం నిజంగా చాలా గర్వకారణమన్నారు. నిరుపేదలకు వస్త్రదానం చేశారు.

వైభవంగా సత్యవ్రతాలు

పిఠాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని బొజ్జావారితోటలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున నగరసంకీర్తన జరిగింది. ఉదయం ప్రశాంతి పతాక ఆవిష్కరణ, జ్యోతిప్రజ్వలన అనంతరం సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. వ్రతాలు ఆచరించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సత్యసాయిబాబాను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, పలువురు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నగర పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం

● ఇన్‌చార్జి కమిషనర్ సుధాకర్


డంప్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ సుధాకర్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడనగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ కేటీ సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పర్లోవపేటలోని సాగర్‌ఇగేషన్ ప్లాంట్, డంపింగ్ యార్డు సందర్శించారు. అక్కడ ఉత్పత్తి అవుతున్న సేంద్రియ ఎరువును త్వరితగతిన తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎరువు తరలింపు వేగం పెరిగితే కొత్త చెత్తను డంప్ చేసేందుకు యార్డులో తగిన స్థలం లభిస్తుందని ఆయన తెలిపారు. సంజయ్‌నగర్ నుంచి పాతపోర్టు రైల్వేస్టేషన్ వరకు రహదారి నిర్మాణం వారంరోజుల్లో ప్రారంభం కానుండడంతో చెత్త డంపింగ్ కోసం ప్రత్యామ్నాయ ప్రదేశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. రాజాట్యాంక్ సమీపంలోని అన్నాక్యాంటీన్‌ను పరిశీలించారు. అల్పాహార ప్రమాణాలు సరిగ్గా పాటించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, డీఈ ఆదినారాయణ ఉన్నారు.

లోక్‌అదాలత్‌తో కేసుల రాజీకి అవకాశం

● అదనపు జిల్లా జడ్జి శ్రీహరి


సూచనలు ఇస్తున్న అదనపు జిల్లా జడ్జి శ్రీహరి

పిఠాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌ల ద్వారా కేసుల రాజీకి అవకాశం ఉందని, తద్వారా సత్వర న్యాయం లభిస్తుందని 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తెలిపారు. పిఠాపురం పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి శనివారం పోలీసు, ఎక్సైజు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు రాజీ చేయడానికి పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు విజయరామేశ్వరీ, వీవీ అపర్ణ, ఏపీపీ జగదీష్, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

● కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్


విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్న ఎంపీ ఉదయశ్రీనివాస్

పిఠాపురం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఇష్టంతో చదవడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ సూచించారు. పిఠాపురం పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు తదేకం ఫౌండేషన్ సౌజన్యంతో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మీ స్టడీ మెటీరియల్ సమకూర్చారు. శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఈ పుస్తకాలను ఎంపీ ఉదయశ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు తదితరులు విద్యార్థులకు అందజేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఎంఈవో శ్యాంబాబు, జనసేన ఫైవ్‌మేన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాషన్ షో

● రేపు లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం



కాకినాడ, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): కాకినాడలో త్వరలో ప్రారంభం కానున్న లక్కీ షాపింగ్ మాల్ గత రెండు, మూడు రోజులుగా వినూత్న ప్రచారాన్ని చేపట్టింది. నగరవాసులను ఆకర్షించేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన యువతీయువకులతోపాటు చిన్నారులు వివిధ రకాల వస్త్రాలు ధరించి ర్యాంపు వాక్‌చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా పార్కుకు వచ్చిన సందర్శకుల పేర్లను లక్కీ డ్రాగా తీసి బహుమతులు అందజేశారు. సోమవారం ఘనంగా ప్రారంభం కానున్న లక్కీ షాపింగ్ మాల్‌ను అందరూ సందర్శించాలని షాపు యజమాన్యం కోరింది. అలాగే ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఎస్ఆర్ఎంటీ మాల్‌లో ఫ్లాష్‌మాబ్‌తోపాటు ర్యాలీగా కూడా నిర్వహిస్తామని లక్కీషాపింగ్ మాల్ అధినేత రత్తయ్య తెలిపారు. ప్రస్తుతం కాకినాడలోను 14వ బ్రాంచిని సోమవారం ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాపార భాగస్వాములు శ్రీనివాస్, మణికంఠ, సంస్థ సిబ్బంది సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

తాళ్లరేవు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ చిల్డ్రన్స్‌డేను పురష్కరించుకుని రిలయన్స్‌సంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీపతిపురం హైస్కూల్ ప్రాంగణంలో శనివారం గాడిమొగ, భైరవపాలెం గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈక్రీడా పోటీలను విద్యాశాఖాధికారి ఎం.ఉమ లాంఛనంగా క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఖోఖోలో రన్నర్స్‌గా చినవలసల, విన్నర్స్‌గా లక్ష్మీపతిపురం క్రీడాకారులు నిలిచారు. కబడ్డీలో రన్నర్స్‌గా గాడిమొగ, విన్నర్స్‌గా భైరవపాలెం నిలిచారు. వాలీబాలులో రన్నర్స్‌గా భైరవపాలెం, విన్నర్స్‌గా లక్ష్మీపతిపురం క్రీడాకారులు నిలిచారు. విజేతలకు రిలయన్స్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్‌లు బహుమతులు అందించారు.

రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపట్ల శ్రద్ధ కనబరచకపోవడంవల్ల గాలి, నీరుతోపాటు అన్నీ కలుషితమవుతున్నాయని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వీరభద్రారెడ్డి అన్నారు. రోటరీ హాల్‌లో శనివారం రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ సమావేశం క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ గోపినాధ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ-మానవాళి జీవనం అనే అంశంపై ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాబీ మా ట్లాడుతూ నేడు మానవాళి జీవనం ప్రమాదం అంచున ఉందన్నారు. అనంతరం అన్ని క్లబ్ ల ప్రతినిధులు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బాబీని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సమావేశంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, తాళ్లూరి శ్రీనివాస రాజు, రవి, చెలికాని సూర్యారావు, ఉమామహేశ్వరరావు, నల్ల మిల్లి మాచారెడ్డి, చిరంజీవిరెడ్డి, స్వామిశేఖర్, భమిడిపాటి శ్రీకృష్ణ, మాజేటి పవన్, గొడవర్తి సత్యమూర్తి పాల్గొన్నారు.

వైద్య విద్యను అందుబాటులోకి తెస్తుంటే విమర్శలా

● పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే వైసీపీ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకుంటున్న వారు ఒకదానిని పూర్తి చేయలేదన్నారు. కనీసం కళాశాలల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వ వాటా విడుదల చేయలేదని విమర్శించారు. వాటికి సిబ్బంది, ప్రొఫెసర్ల నియమాకం జరపలేదని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సదరు వైద్య కళాశాలలు అన్నింటికీ పీపీపీ విధానంలో అభివృద్ధిచేసి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించిందని చెప్పారు. వీటిపై పూర్తి పర్యవేక్షణ ప్రభుత్వానికే ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే వైద్య విద్యను ప్రవేటీకరణ చేస్తున్నారంటూ వైసీపీ నేతలతో కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టడానికి జగన్‌కు సిగ్గుండాలని వర్మ అన్నారు. ఈ విషయంలో వారు చెబుతున్నవన్నీ అబద్ధాలేనని తెలిపారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, కొండేపూడి సూర్యప్రకాష్, సోము సత్తిబాబు, కొరుప్రోలు శ్రీను, మడికి ప్రసాద్, మొల్లి నాగమరిడి రాజు, గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

● కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ


ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గ్రామీణ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ట్రాన్స్‌కో అధికారులు కృషిచేయాలని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడరూరల్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి స్థానిక రామారావుపేటలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో శనివారం ఎలక్ట్రికల్ డీఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన ట్రాన్స్‌కో అధికారులతో రూరల్ ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమీక్షా సమావేశంలో 56 సమస్యలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దృష్టికి తీసుకురాగా సుమారు 50 సమస్యలను పరిష్కరించిన అధికారుల పనితీరును ఎమ్మెల్యే నానాజీ ప్రశంసించారు. ప్రస్తుతం సమీక్షించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ అమలు వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల అమలును వ్యతిరేకిస్తూ కాకినాడ కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఆర్‌యూ ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ ఏపీ అండ్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లూరి రాజు, ఏఐటీ యూసీ జిల్లా ప్రధానకార్యదర్శి తోకల ప్రసాద్, ఏఐసీసీ టీయూ రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కుల పాలిట ఉరితాళ్లుగా మారాయని ధ్వజమెత్తారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి రమణ, రాజా, అజయ్ కుమార్, భారతి, అప్పారావు, వర్మ, నరేష్, చరణ్, మహేశ్, రవి పాల్గొన్నారు.

'ఉపాధి నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలి'

సర్పవరంజంక్షన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. శనివారం కాకినాడరూరల్ మండలంలో వలసపాకల, సర్పవరం, వాకలపూడి తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకంపై గ్రా మసభలు నిర్వహించారు. జాబ్‌కార్డుల కోసం ఎన్నిసార్లు అడిగినా స్పందించడంలేదని, ఉన్న జాబ్‌కార్డులను అధికారులు తొలగిస్తున్నారని వలసపాకల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెం. 183లో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్త వేస్తున్నారని, ఈ భూమిని కోరమండల్ పరిశ్రమకు అధికారులు అప్పగిస్తున్నారన్న ప్రచారంపై అధికారులు సమాధానం చెప్పాలని కూటమి నాయకులు సలాది శ్రీనుబాబు, తాతపూడి రామకృష్ణ, సీఐటీయూ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణలు డిమాండ్ చేశారు. ఇన్‌చార్జ్ సెక్రటరీ కె.వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్థులు మాట్లాడారు. సమావేశంలో కూటమి నాయకులు జీని శ్రీనివాస్, పండు నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి పథకం ద్వారా 2026-27కి చేపట్టే పనుల గుర్తించేందుకు కొత్తపల్లి మండలంలో శనివారం గ్రామాల వారీగా గ్రామసభలు జరిగాయి. గ్రామసభల నిర్వాహణ షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో పనులు కావాల్సిన వారి జాబితా సేకరించి ఉపాధి కల్పించడం, కొత్తగా ఉపాధి పనులకు వచ్చే వారికి జాబ్‌కార్డులు మంజూరు చేయడం, ప్రధాన పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో రెడ్డి, ఏపీవో గున్నాబత్తుల కొండలరావు పలువురు మండస్థాయి అధికారులు గ్రామసభల్లో పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల కుటుంబాల్లోని నిరుద్యోగులకు జాబ్‌మేళా


అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెప్మా నిపుణుల సంస్థల భాగస్వామ్యంతో జిల్లా పరిధిలోని కాకినాడ సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని, ఏలేశ్వరం, గొల్లప్రోలు మున్సిపాలిటీలకు చెందిన స్వయం సహాయక సంఘాల కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం శనివారం కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో ఫైనాన్స్, ఫార్మా, రిటైల్ రంగాల 19కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 1,732మంది నిరుద్యోగయువతీ యువకులు ఇంటర్వ్యూకు హాజరుకాగా వారి విద్యార్హతలను బట్టి ఎంపికలు చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థుల కు నియామక ఉత్తర్వులు అందజేశారు. జాబ్‌మేళాను మెప్మా కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద, మెప్మా సిబ్బంది, నిపుణుల సిబ్బంది పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ జి.శ్రీలక్ష్మీ, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ కె.శైలజ, డీసీవో ప్రసాద్, జిల్లా జీవనోపాధి అధికారి పి.రవిశంకర్, కాకినాడ సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వద్దు: డీఆర్వో

గొల్లప్రోలురూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేసినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. అనంతరం పొలాల్లో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. రైతుల ధాన్యం విక్రయించడానికి వచ్చిన సమయంలో వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్లు ఉండాలని స్పష్టం చేశారు. తహసీల్దారు రామకుమార్ ఉన్నారు.

రైతులు వరి పంటను ఒబ్బిడి చేసుకోవాలి

గొల్లప్రోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా 25వ తేదీ వరకూ అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో రైతులు కోసిన వరి పంటను, ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని గొల్లప్రోలు వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ రామకుమార్‌లు సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట విషయంలో కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ధాన్యం రాశులు తడవకుండా బరకాలు కప్పాలని తెలిపారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని రెవెన్యూ, వ్యవసాయశాఖల సిబ్బందికి సూచించారు.

మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పిఠాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చదువుతున్న సమయంలోనే నైపుణ్యాలను సాధించడం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డిజిటల్ మార్కెటింగ్ వ్యాపారవేత్త, రిసోర్స్‌పెర్సన్ ఎస్.దేవి సూచించారు. పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం, మహిళా సాధికారికత సెల్ ఆధ్వర్యంలో ఉమెన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్‌పై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఉషశ్రీ, కామర్స్ అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులుగా ముగ్గురికి కారుణ్య నియామకం


నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ మృతి చెందినవారి కుటుంబీకులు ముగ్గురికి కారుణ్య నియామకం కల్పిస్తూ ఎస్పీ జి.బిందుమాధవ్ శనివారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులుగా పనిచేస్తూ మృతి చెందిన వి.గోవిందరాజు కుమారుడు వి.లక్ష్మీనారాయణకు అలాగే కె.మణి రాజు భార్య కె.హేమలతకు, సీహెచ్ దుర్గాప్రసాద్ భార్య నందినికి ఈ హోంగార్డ్ ఉద్యోగ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమన్నారు. హోంగార్డుల ఒక రోజు వేతనాన్ని బాధిత కుటుంబాకులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ ఎం.నరసింహమూర్తి, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నూతన విగ్రహాల ప్రతిష్ఠ

సామర్లకోట, నవంబరు22(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం చెంతన కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్రసరస్వతి స్వామీజీ ఆశీస్సులతో సుబ్రహ్మణ్యేశ్వర, కాలభైరవ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు ఆదివారం నుంచి బుధవారం వరకూ జరగనున్నట్లు కంచి మహాసంస్థానం నిర్వాహకులు చంద్రా భట్ల పతంజలి, పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్‌లు శని వారం సాయంత్రం తెలిపారు. ఆదివారం గణపతిపూజలతో ప్రారంభమవుతాయన్నారు. గోపూజ రుత్విక్ వరుణలు, సుబ్రహ్మణ్య, కాలభైరవ జపములు నిర్వహిస్తారన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులుపాల్గొని ప్రసా దాలు స్వీకరించాలని పతంజలి, మట్టే శ్రీనివాసులు తెలిపారు.

క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా హరీష్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆర్ఎంసీలోని అసోసియేషన్ భవనంలో శనివారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నక్క వెంకటేష్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివశిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు క్రికెట్ అసోసియేషన్‌కు తగిన సేవలు అందించలేకపోతున్నానని రాజీనామా చేయడంతో కమిటీ ఆమోదించింది. ఆయన స్థానంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు ఎన్నో సేవలు అందించిన తలాటం హరీష్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ సర్ఫరాజ్ నవాజ్, కోశాధికారి జి.అప్పారావు, కౌన్సిలర్ ఎన్.సత్యానందం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మా ఫ్యూజన్ 2 కే 25 సదస్సు

జేఎన్‌టీయూకే (కాకినాడ), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైనెన్స్ అండ్ టెక్నాలజీస్-ఐఎస్‌టీ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్న ఫార్మా ఫ్యూజన్ 2కే 25 సదస్సు శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో లైఫ్ ట్రాన్స్ఫార్మింగ్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోర్ట్స్ చైర్మన్, స్వార్థభారతి స్పెల్-జి సీ ట్రస్ట్ ప్రముఖులు డాక్టర్ వై.మోహనరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసానికి పునాది అయిన సత్యశోధన, శక్తి గురించి వివరించారు. ఆరోగ్య ప్రాముఖ్యతపై సత్య స్కాన్ సెంటర్ ఎండీ డాక్టర్ కాదా వెంకటరమణ వివరించారు. లైపియస్ ఫార్మాస్యూటికల్ ప్లాంట్ హెడ్ ఎస్.లక్ష్మీనారాయణ్ మాట్లాడుతూ కొత్తగా అందుబాటులోకి వచ్చిన సాంకేతికతలను స్వీకరిస్తూ, ఇండస్ట్రీ 5.0 యుగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ పురోగతి సాధించాలని విద్యార్థులను కోరారు. ప్రధాని మోదీ మేక్ ఇన్ ఇండియా పిలుపుమేరకు త్వరలో భారతీయ ఫార్మా పారిశ్రామిక రంగం ఆవిష్కరణల్లో అగ్రస్థానంలో నిలుస్తుందని జనరల్ మేనేజర్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజంటేషన్ చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్టూడెంట్స్ అఫైర్స్ ప్రొఫెసర్ ఎ.కృష్ణమోహన్, ఫార్మాస్యూటికల్ సైనెస్ విభా గాధిపతి ప్రొఫెసర్ బి.భవాని బహుమతులు పంపిణీ చేశారు.

అన్నదాన కమిటీ సభ్యులకు సత్కారం

కాకినాడరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ మండలం తూరంగిలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు జక్కిఅప్పన్న ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భక్తులకు 41 రోజులపాటు అన్నదానం నిర్వహించిన అన్నదాన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేసిన దాతల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీతారాం, బొజ్జ సాంబ శివరావు, కన్నూరి నూకరాజు, అయ్యప్పస్వామి అన్నదాన ట్రస్ట్ సభ్యులు గండి వాసు, రొంగల బుజ్జి, బంగారు అశోక్, బోలం శ్రీనివాస్ కన్నూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలో అన్నదానం నిర్వహించారు. కార్తీకమాస చివరిరోజు పురస్కరించుకుని నగరసంకీర్తన చేశారు. గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు హాజరై స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. భారీగా భక్తులు హాజరయ్యా రు. తెలగరెడ్డి భద్రరావు, కంచర్ల వెంకటేశులు, కంచర్ల దుర్గాప్రసాద్, పోతుల సత్యనారాయణ, వల్లభశెట్టి వెంకటరమణ, భద్రం పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మోతుగూడెంలో సినిమా చిత్రీకరణకు ఏర్పాట్లు





పొల్లూరు శ్రీదుర్గా మల్లేశ్వర ఆలయం ఆవరణలో సెట్టింగ్స్

మోతుగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో రవితేజ, ఆషికా రంగనాథ్ నటీ నటులుగా రూపొందిస్తున్న కొత్త సినిమాలో పలు సన్నివేశాల చిత్రీకరణకు మోతుగూడెం పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే ఎంపిక చేసుకున్న లొకేషన్లో సెట్టింగులు వేస్తున్నారు. ఈనెల30 నుంచి నుంచి డిసెంబరు 20వరకు షూటింగ్ చేయనున్నట్లు తెలిసింది. ముందుగాఎగువ సీలేరులో పది రోజులు చిత్రీకరించిన అనంతరం మోతుగూడెం పర్యాటక ప్రాంతాల్లో షూటింగ్ కొనసాగనుంది. ఇప్పటికే మోతుగూడెం, చుట్టుప్రక్కల గ్రామాల్లోని రిసార్ట్‌లను యూనిట్ బుక్ చేసుకుంది. పొల్లూరు శివాలయం, క్రికెట్ మైదానం, ధారాలమ్మ పిక్నిక్ స్పాట్, పొల్లూరు ఎగువ, దిగువ జలపాతాలు, జలాశయాలు, పుష్పవంతెన, సీలేరు ప్రాంతాల్లో పలు సన్నివేశాలను చిత్రీకరించనున్నారు

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హోసన్నా హైస్కూల్ విద్యార్థి



ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభకనబరిచిన హోసన్నా హైస్కూల్ విద్యార్థులు

అడ్డతీగల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల19 నుంచి 21వరకు జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మండలంలోని హోసన్నా హైస్కూల్ విద్యార్థి జి.సమురా ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మృదుహాసిని తెలిపారు. అలాగే ఈపోటీల్లో నరసయ్య, జావ్‌తేజ, జగ్‌బంద్, అంజలి పాల్గొన్నారు. పీఈటీ సుందరం ప్రత్యేక శ్రద్ధతో ఈవిజయం సాధించామన్నారు. విజేతలను ప్రిన్సిపాల్ హాసిని, డీన్ ధన సందీప్, డైరెక్టర్ డేనియల్ సందీప్ అభినందించారు.

తామరపల్లిలో ఉపాధి హామీ గ్రామసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తామరపల్లి పంచాయతీలో సర్పంచ్ మిర్తివాడ అనంద్‌రెడ్డి ఆధ్యక్షతన శనివారం ఉపాధి హామీ పథకం పనుల మంజూరుకు గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ వంశీ కుంజం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో గల వివిధ రకాలైన పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ చిట్టిదొర, పీసా కమిటీ కార్యదర్శి కొండయ్య, వీఆర్వో డీవీవీ సత్యనారాయణ, ఫీల్డ్‌అసిస్టెంట్లు మడకం నాగన్నదొర, శారపు శ్రీనివాస్‌దొర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల వివరాలకు సహ చట్టంతో అప్పీల్

ఎటపాకలో రికార్డులు తనిఖీ చేసిన మానవహక్కుల కార్యకర్త



తనిఖీ అనంతరం నివేదికను అంజేస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

ఎటపాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపేట రెవెన్యూ గ్రామం పరిధిలో ప్రభుత్వ భూముల వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న తెలంగాణకు చెందిన మానవ హక్కుల కార్యకర్త గంగాధర్ కిశోర్‌కుమార్ శనివారం ఎటపాక తహశీల్దార్ కార్యాల యంలో తహశీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. లక్ష్మీదేవిపేట రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల వివరాలు కోరుతూ 2023లో కిశోర్‌కుమార్ ఎటపాక తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు దరఖాస్తు చేశారు. అయితే ఈరెండు కార్యాలయాల నుంచి గడువు ముగిసినా సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన రాష్ట్ర సమాచార కమిషన్ దరఖాస్తు దారుడితో పాటు రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈనేపథ్యంలో శనివారం గంగాధర్ కిశోర్ ఎటపాకలో రెవెన్యూ రికార్డులు తనిఖీ చేయగా, కేవలం ఆరు రికార్డులే లభ్యమైనట్లు ఆయన చెప్పారు.

పారిశుధ్య పనుల పరిశీలన

అడ్డతీగల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మట్లపాడు పంచాయతీలో పారిశుధ్య పనులను శనివారం ఎంపీడీవో పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరించి సంపద కేంద్రానికి తరలించాలని సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణ రిక్షా ప్రతీ రోజూ వస్తుందో లేదో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. షెడ్డు ముందు విపరీతంగా పొదలు పెరిగి ఉండడం, బోర్డు లేకపోవడంపై కార్యదర్శితో మాట్లాడి వెంటనే తుప్పలు తొలగించి బోర్డు పెట్టాలని ఆదేశించారు.

గ్రామాల్లో ఉపాధి గ్రామసభలు

ప్రత్తిపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి 22గ్రామాల్లో శనివారం ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. పెద్దిపాలెంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, యజేపురం, చింతలూరు, ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాల్లోని నిర్వహించిన ఉపాధి గ్రామసభల్లో ఏపీవో కుమారస్వామి పాల్గొన్నారు. ఈసభల్లో అవసరమైన వారికి జాబ్‌కార్డులు 24గంటల్లో అందజేస్తామని అధికారులు తెలిపారు. చనిపోయిన, వలసపోయిన జాబ్‌కార్డుదారులను తొలగించామన్నారు. వలస పోయిన వారు తిరిగివచ్చి జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తే తిరిగి అందజేస్తామని ఎంపీడీవో, ఏపీవో తెలిపారు. గజ్జెనపూడి గ్రామ పంచాయతీలో ఉపాధి గ్రామసభ సోమవారానికి వాయిదా పడింది.

రైతులకు సత్ఫలితాలు ఇవ్వాలి

వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

జగ్గంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వ్యవసాయ శాఖ అధికారులతో రైతన్న మీకోసం కార్యక్రమంపై క్యాంప్ ఆఫీసులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి 29 వరకు అన్ని గ్రామాల్లో రైతుల కుటుంబాలను కలిసి వ్యవసాయ విధానాలు, పాటించవలసిన మెరుగైన పద్ధతులపై చర్చించారు. రైతులకు ప్రభుత్వ నుంచి వచ్చే ప్రయోజనాలు, దిగుబడి రావడానికి అభ్యుదయ వ్యవసాయం చేయడానికి కావలసిన సూచనలు ఇచ్చి, వారి సమస్యల్ని తెలుసుకుని నమోదు చేసి ఉన్నతాధికారికి నివేదించే ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. రోజుకి 90 వ్యవసాయ కుటుంబాలను కలిసి నివేదికలను యాప్‌లో పంపించి వారికి కావాల్సిన వసతులు ఇతర సహాయాన్ని నమోదు చేసుకుని దానిపై నివేదిక తయారు చేయాలన్నారు. ఈవిధంగా సేకరించిన గ్రామ వివరాలతో సమీక్ష నిర్వహించి పూర్తి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు రైతు సేవ కేంద్రం అధికారి నివేదించాలన్నారు. అన్ని మండలాలపై ప్రతి రోజు సమీక్షిస్తానని, అందరూ పాల్గొని రైతులకు సత్ఫలి తాలు వచ్చే విధంగా సహాయపడాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జగ్గంపేట సహాయ సంచాలకులు గరిమెళ్ళ శ్రీని వాస్, పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాల కులు దైవకుమార్, కోరుకొండ వ్యవసాయ సహాయ సంచా లకులు శశిబిందు తదితరు అధికారులు పాల్గొన్నారు.

నెహ్రూకు ఆహ్వానం

జగ్గంపేట, రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జ్యోతుల నెహ్రూకు శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహా ఆవిష్కరణ, శిలా మూర్తి ప్రతిష్ఠాపన ఆహ్వానపత్రాన్ని ఆలయ కమిటీసభ్యులు పాలచర్ల మంగారావు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, కందుల వీర బాబు అందించారు. గండేపల్లి మండలం తాళ్లూరు నుంచి ఉప్పలపాడు వెళ్లే మార్గంలో పోలవరం కాలవ గట్టు పక్కన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 18 అడుగుల విగ్రహావిష్కరణ, శిలామూర్తి ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఉదయం 9.15 గంటలకు జరుగుతుంద న్నారు. దీనికి హాజరవ్వాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులను ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర కమ్మ కా ర్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ముస్తాబవుతున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తుమ్మలపల్లి రమేష్

కిర్లంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఈనెల 26న జరగబోయే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠికి రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళిస్వామి ఆలయంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ముస్తాబవుతుంది. సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లను తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి

రామచంద్రపురంలో ఏర్పాట్లు పరిశీలించిన

జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి

చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరిశీలించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మెట్ట ప్రాంత అన్నపూర్ణ ... సీతయ్యమ్మ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత అన్నపూర్ణగా బుచ్చి సీతయ్యమ్మ మహరాణి నిలిచిపోతారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం మహరాణి 190వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభను చైర్మన్ సోమరౌతు చంద్రబాబు అధ్యక్షతన ఈవో యర్రా వెంకటేశ్వరరావు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సౌకర్యాలు లేని రోజులలో ముందుచూపుతో బాటసారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, పర్వత సురేష్, రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టరు వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు, కీర్తి వెంకటసుభాష్, పోలం చిన్నా, కర్రి శివాజీ, ఈగల దేవుళ్ళు, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



కొంతంగిలో మాట్లాడుతున్న వక్తలు

శంఖవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక బాధ్యతతోపాటు నాయకత్వ లక్షణాలకు పెంపొందించుకోవాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కత్తిపూడి సీతారామ కళాశాల వాలంటీర్ల ఆధ్వర్యంలో కొంతంగిలో శిబిరం నిర్వహించారు. వెంకటేశ్వరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతోపాటు పౌర బాధ్యత ఎన్ఎస్ఎస్ ద్వారా వస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు, సిబ్బంది శివాజీ, ఎన్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు చర్యలు

శంఖవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ తెలిపారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఇంటింటికీ సమగ్ర సర్వే నిర్వహించి చనిపోయిన వారిని తొలగించడం, కొత్తవారిని చేర్చడం, చిరునామా మార్పులు వంటివి చేపడతామని తెలిపారు. ఎస్ఐఆర్ అని పిలిచే ఈ ప్రక్రియలో బీఎల్‌వో ప్రతి ఇంటినీ సందర్శించి వివరాలను ధృవీకరిస్తారని తెలిపారు.

ఘనంగా షిర్డీసాయి విగ్రహ ప్రతిష్ఠ



ఏలేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం షిర్డీసాయి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద కోరాడ అప్పలస్వామి ఆర్థిక సహాయంతో పురోహితులు సత్యనారాయణ ఆధ్వర్యంలో కోరాడ శ్రీనివాసరావు, సుగుణ దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు సాయినాథుడిని దర్శించుకు న్నారు. కార్యక్రమంలో సామంతుల సూర్యకుమార్, గూడవిల్లి అర్జునరావు, పైల విజయకుమార్, గోళ్ల విజయకుమార్, గంపా చరణ్, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పని కల్పిస్తాం

కోటనందూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగిన వారందరికి పని కల్పిస్తామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. కోటనందూరులోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కోటనందూరులో నిర్వహించిన గ్రామసభకు పీడీ హాజరయ్యారు. జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పని కల్పిస్తామన్నారు. సీసీ రహదారులు, మ్యాజిక్ డ్రైన్స్, మినీ గోకులాలు, పండ్లతోటల పెంపకాలు తదితర విషయాలను గ్రామసభలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటనారాయణ, ఏపీవో డి. రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి కరుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పెరికి కార్పొరేషన్ చైర్మన్‌గా వీరభద్రరావు

ప్రత్తిపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా వనపర్తి వీరభద్రరావు నియమితులయ్యారు. కూటమిప్రభుత్వం శనివారం రాష్ట్రంలోని మరో 11 కార్పొరేషన్లకు చైర్మన్‌లు నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రత్తిపాడు నుంచి వీరభద్రరావు చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రత్తిపాడు, కాకినాడ, పెద్దాపురం, తుని, జగ్గంపేట ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, వనమాడి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, యనమల దివ్యతో పాటు మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, పిల్లి సత్యనారాయణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులకు ప్రతినెలా 9న సత్రం భోజనాలు

రౌతులపూడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతినెలా 9వ తేదీన గర్భిణులకు ఉచితంగా కత్తిపూడి సత్రం భోజనం అందిస్తుందని సత్రం చైర్మన్ ఎస్.చంద్రమౌళి తెలిపారు. రాజావత్సవాయి బుచ్చి సీతాయమ్మ రాణీ బహదూర్ 190 వర్ధంతికి సత్రం రైతులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో సత్రం నుంచి రౌతులపూడి, శంఖవరం ప్రభుత్వ ఆసుపత్రిలకు ప్రతినెలా గర్భిణిలకు ఉచితంగా భోజనాలు అందస్తామన్నారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ ఇట్టంశెట్టి సూర్యభాస్కరరావు ఉన్నారు.

జాబ్‌కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి : పీడీ

రౌతులపూడి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగిన వారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. ఈకేవైసీ లేని 1500 జాబ్‌కార్డులను రద్దు చేసినట్టు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల నిమిత్తం గ్రామసభలు నిర్వహించారు. మూలగపూడిలో జరిగిన గ్రామసభకు పీడీ హాజరయ్యారు. జాబ్‌కార్డు కలిగినవారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఉపాధి పనిలోకి వచ్చే వారందరికీ జాబ్‌కార్డు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

కార్యకర్తలకు జనసేన అండ



సత్తిబాబు కుటుంబానికి సాయం అందజేస్తున్న జనసేన నేత క్రాంతి

ఏలేశ్వరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకురాలు బూర్లపూడి క్రాంతి అన్నారు. సిరిపురంలో శనివారం పర్యటించి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వజ్రంగి సింగరాజును ఆమె పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సూర్నీడి సురేష్, నల్లల రామకృష్ణ, దొడ్డి శ్రీనివాస్, దుర్గాప్రకాష్, వీరబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ కోటా సాధనకు ఉద్యమిద్దాం

ఏలేశ్వరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తూర్పు కాపులకు ఓబీసీ కోటా సక్రమంగా అమలు కాకపోవడంతో ఆర్థికంగా తీవ్రనష్టం జరుగుతున్నదని తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సహాయ అధ్యక్షులు బడ్డు కొండ వెంకటరమణ అన్నారు. శనివారం ఏలేశ్వరం వచ్చిన ఆయన జిల్లా అధ్యక్షులు కోదండరామ్‌తో కలిసి బీసీ నేతలు అలమండ చలమయ్య, పైల సుభాష్ చంద్రబోస్, తదితరులను కలుసుకున్నారు. తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్ వచ్చేందుకు చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. త్వరలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను కలిసి వినతిపత్రాలు ఇద్దామని వారు సూచించారు.

పెద్దిపాలేనికి సిమెంట్ రోడ్డు



పూర్తయిన సిమెంటు రహదారి

ప్రత్తిపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెం-ఉత్తరకంచి రహదారికి మోక్షం లభించింది. కొన్నేళ్లుగా శిథిల రహదారితో అవస్థలు పడిన ఈ రెండు గ్రామాల ప్రజల చిరకాల కోరిక సిమెంట్ రోడ్డుతో నెరవేరింది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషి మేరకు పెద్దిపాలెం పాఠశాల సెంటర్ నుంచి ఉత్తరకంచి గ్రామం వరకు సిమెంట్ రహదారి పూర్తయ్యింది. ప్రస్తుతం ఈ రహదారికి వాటర్ క్యూరింగ్ పనులు చేస్తున్నారు. త్వరలో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి



ధర్మవరంలో సంస్థను ప్రారంభిస్తున్న ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి

ప్రత్తిపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైసీపీ నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు తెలిపారు. ధర్మవరంలో నిరుద్యోగ యువతి అంబటి మరియ ఏర్పాటు చేసిన ఎస్ మార్క్ వాణిజ్య సంస్థను శనివారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, ఎంపీటీసీ నానిపల్లి సత్యవతి, మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, గ్రామపెద్దలు బొల్లు నాగేశ్వరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, అంబటి భీమరాజు, అంబటి గణేష్, రవికిషోర్, బోడా భాను, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాషన్ షో

● రేపు లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం



ఫ్యాషన్ షో నిర్వహిస్తున్న దృశ్యం

కాకినాడ, నవంబర్ 22, (ఆంధ్రజ్యోతి): కాకినాడలో త్వరలో ప్రారంభం కానున్న లక్కీ షాపింగ్ మాల్ గత రెండు, మూడు రోజులుగా వినూత్న ప్రచారాన్ని చేపట్టింది. నగరవాసులను ఆకర్షించేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన యువతీ యువకులతోపాటు చిన్నారులు వివిధ రకాల వస్త్రాలు ధరించి ర్యాంపు వాక్‌చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా పార్కుకు వచ్చిన సందర్శకుల పేర్లను లక్కీ డ్రాగా తీసి బహుమతులు అందజేశారు. సోమవారం ఘనంగా ప్రారంభం కానున్న లక్కీ షాపింగ్ మాల్‌ను అందరూ సందర్శించాలని షాపు యజమాన్యం కోరింది. అలాగే ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఎస్ఆర్ఎంటీ మాల్‌లో ఫ్లాష్‌మాబ్‌తోపాటు ర్యాలీగా కూడా నిర్వహిస్తామని లక్కీషాపింగ్ మాల్ అధినేత రత్తయ్య తెలిపారు. ప్రస్తుతం కాకినాడలోను 14వ బ్రాంచిని సోమవారం ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాపార భాగస్వాములు శ్రీనివాస్, మణికంఠ, సంస్థ సిబ్బంది సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకి ప్రత్యేక పూజలు



ఉత్తరకంచిలో స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తరకంచి గ్రామంలో ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని పురోహితులు సత్యప్రసాద్ ఆచార్యులు వేద మంత్రాలతో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఉత్తరకంచి, పెద్దిపాలెం, వేములపాలెం, రౌతుపాలెం, లంపకలోవ, ఒమ్మంగి, పొదురుపాక తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర కంచికి చెందిన దాసరి కృష్ణ కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం జరిపారు.

వైభవంగా గౌరమ్మ సంబరం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తుని పల్లపు వీధిలో గౌరమ్మ గుడి గా పిలవబడే గౌరీశంకరీ సమేత వీరభద్ర స్వామివారి ఆలయం నుంచి స్వామి,అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్తీకమాసం నెల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సంబరం జరిపి తాండవ నది వద్ద నిమజ్జనం చేశారు. భారీగా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతోఅమ్మవారికి సారె సమర్పించారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు



ఎన్.సూరవరంలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అబ్బాయి

తుని రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య చొరవతో ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి తెలిపారు. ఆయన ఎన్.సూరవరం ప్రభుత్వ హైస్కూల్లో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్న భారీ షెడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించే సమయంలో అనుకూలంగా ఉండేలా ఈ షెడ్‌ను ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే చొరవ చూపారన్నారు.

12మంది రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు

కిర్లంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12మంది రౌడీషీటర్లపై శనివారం కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి గొడవలు, భౌతికదాడులకు పాల్పడరాదని రౌడీషీటర్లకు సూచించారు. వారిని సత్‌ప్రవర్తన కోసం కిర్లంపూడి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా ఆరు నెలలు పాటు బైండోవర్ చేశారు.